## ఖమ్మం వీధుల్లో కనువిందు.. శ్రీజగన్నాథ

# రథయాత్ర



### భారీ సంఖ్యలో పాల్గొన్న ఖమ్మం నగర ప్రజలు, ప్రముఖులు



వనం నాగయ్య, కెరటం న్యూస్



ఖమ్మం నగరంలో గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఖమ్మం నగరంలో జగన్నాథ రథయాత్రకు ప్రజలనుండి విశేష స్పందన లభించింది. జై జగన్నాథ, జై జై జగన్నాథ..హరేరామ, హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే కృష్ణ.. గోవిందా..గోవిందా అంటూ భక్తులు జయజయ ధ్వానాలతో రామ నామ స్మరణతో ఖమ్మం నగర వీధులను హోరెత్తించారు. కన్నుల విందుగా ఖమ్మంలో జరిగిన శ్రీజగన్నాథ రథయాత్రను కెరటం న్యూస్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయడంతో వేలాది మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఖమ్మం నగరానికి చెందిన విష్ణు స్వామి దాస్, శ్రీజీవదాస్ తదితరుల ఆధ్వర్యంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీజగన్నాథ రథయాత్ర ఖమ్మం నగరంలో కొత్త శోభను సంతరించుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

ఇస్కాన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ముచ్చటగా మూడో సారి నిర్వహించిన శ్రీజగన్నాథ రథయాత్రకు ఖమ్మంలోని హిందువు బంధువుల నుండి విశేష స్పందన లభించింది. గతంలో రెండు సార్లు ఇదే రథయాత్ర నిర్వహించినా మూడో సారి బుధవారం నిర్వహించిన రథయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యంగా యువతీ, యువకులు, మహిళలు, వృద్దులు అనే తేడా లేకుండా భారీగా భక్తులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు రథం వెంట నడిచారు. ఈ సందర్భంగా జయజయ ధ్వానాలు, శ్రీరామ నామ స్మరణ, శ్రీజగన్నాథ నామ స్మరణ, శ్రీకృష్ణ నామ స్మరణతో ఖమ్మం పురవీధులు మార్మోగిపోయాయి. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేకంగా తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ఖమ్మం వీధుల్లో కనువిందు చేసిన ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు గాను వేలాది మంది రహదారి వెంట బారులు తీరారు. ఖమ్మంలోని బిలీఫ్ హాస్పిటల్ ఎండీ ఎం.రమాజ్యోతి తన సిబ్బందితో రథయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఎం.రమాజ్యోతి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి రథయాత్రలో పాల్గొన్న వారిని అభినందించారు.

**కెరటం న్యూస్ ప్రత్యక్ష ప్రసారానికి విశేష స్పందన...**

ముచ్చటగా మూడో సారి ఖమ్మంలో జరుగుతున్న శ్రీజగన్నాథ రథయాత్రను కెరటం న్యూస్ ఛానల్‌లో ప్రారంభం నుండి ప్రత్యక్ష ప్రసారం చేసింది. వివిధ కారణాలతో రథయాత్రలో పాల్గొనలేకపోయిన వారు కెరటం న్యూస్‌లో ప్రత్యక్షంగా వీక్షించి కెరటం న్యూస్‌కు తమ అభినందనలు తెలిపారు. అనేక మంది కెరటం న్యూస్ లైవ్‌లో తమ విలువైన సందేశాలను పంపారు. కాగా కెరటం న్యూస్ ఛానల్‌లో ప్రసారం చేసిన విజువల్స్ ఖమ్మం జిల్లాలో వేలాది మందికి చేరడం విశేషం.



**వర్తక సంఘ భవనం నుండి శ్రీరాజరాజేశ్వరి ఆలయం వరకూ..**

శ్రీజగన్నాథ నామ స్మరణతో ఆరంభమైన రథయాత్ర ఖమ్మం నగరంలోని వర్తకసంఘం నుండి ఆరంభమై కిన్నెరసాని థియేటర్, గాంధీచౌక్, కాల్వొడ్డు, జూబ్లీక్లబ్, ఫ్లైఓవర్ మీదుగా మయూరీసెంటర్, పాతబస్టాండ్, వైరా రోడ్ జడ్పీ సెంటర్, ఇల్లందు క్రాస్‌రోడ్, జిల్లా కోర్టు, రోటరీ నగర్ మీదుగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వరకూ కొనసాగింది. అ సందర్భంగా పలువురు వివిధ



వేషధారణలతో యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని రథయాత్రకు స్వాగతం పలికారు.